క్లుప్తంగా

మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఏపీ రైతుసంఘం 9వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల నాయకులు పీ అనిమిరెడ్డి, మల్లేసు కోరారు. ఆదివారం ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పామిడితో పాటు మండలంలోని పలుగ్రామాల్లో వారు పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై సమీక్షించే మహాసభలకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

సంచారజాతులకు రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: సంచారజాతులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ సంచారజాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సంచారజాతుల మహిళా సంఘం కార్యాలయంలో సంచారజాతుల విముక్తి దినోత్సవ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంచారజాతుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. సంచారజాతుల రక్షణకు అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలన్నారు. అలాగే సంచారజాతుల కళలకు గుర్తింపునివ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాల సంత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్ప, మహిళా సంఘం అధ్యక్షురాలు ఇందిరాదేవి, వంశరాజ్ సంఘం నాయకులు ఉలిగప్ప, సుబ్బయ్య, కృష్ణయ్య, వివిధ కులసంఘాల నాయకులు శివ, శేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ ఉత్తర్వులను పట్టించుకోని కమిషనర్


మాట్లాడుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

గుంతకల్లు: ఆప్కాస్ వర్కర్లలో రిటైర్డ్, మరణించిన వారి సంతతిని విధులోక్లి తీసుకోవాలని చైర్‌పర్సన్ భవాని ఉత్తర్వులు జారీ చేసినా మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ పట్టణ గౌరవ అధ్యక్షుడు ఎం.వీరభద్రస్వామి, సీఐటీయూ సంఘం జిల్లా నాయకులు నర్సయ్య ఆరోపించారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం సీఐటీయూ, ఏఐటీయూసీ అధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 2022లో ఆరుగురు ఆప్కాస్ వర్కర్ల (రిటైర్డు, మరణించిన) సంతతిని ఎటువంటి కండీషన్లు లేకుండా ప్రస్తుత చైర్‌పర్సన్ ఉత్తర్వులతో విధుల్లోకి తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఇటీవల గుంతకల్లు మున్సిపాలిటీలో ఆప్కాస్ కార్మికుల్లో ఐదుగురు మరణించగా మరో ఎనిమిది మంది రిటైర్డు అయ్యారు. వీరి సంతతని గతంలో విధంగా తీసుకోవాలని అనేకసార్లు కమిషనర్‌కు విన్నవించామన్నారు. ఈ విషయమై చైర్‌పర్సన్ ఆర్డర్స్ ఇచ్చినా కమిషనర్ పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్‌లో స్పందించి 13 మందిని విధుల్లోకి తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగదీష్, రంగనాయుడు, శ్యాముల్, ఏటీయూసీ నాయకులు చిన్న కొండయ్య, వాసు, వెంకటేసు, పెద్ద పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక


అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) శింగనమల మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శింగనమల మండల కమిటీ ప్రస్తుత అధ్యక్ష, ప్రధానకార్యదర్శులైన శ్రీనివాసమూర్తి, రామమూర్తిని మరోమారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా వెంకటరమణ, అంజలి వ్యవహరించారు. శ్రీనివాసమూర్తి, రామమూర్తిని జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, నరసింహులు, వన్నప్ప, సూర్యనారాయణ, ఆనంద్ తదితరులు అభినందనలు తెలిపి సన్మానించారు.


తాడిపత్రిలో వినాయకుడి ఊరేగింపు


తాడిపత్రిలోని పంచముఖ గణపతి


బుక్కరాయసముద్రంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం

గంగ ఒడికి గణనాథుడు

తాడిపత్రిరూరల్: తాడిపత్రి పట్టణంలో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పట్టణంతోపాటు గన్నెవారిపల్లి కాలనీలోని దాదాపు 220 విగ్రహాలు ఊరేగింపుగా తరలి వెళ్లాయి. విగ్రహాల ఊరేగింపునకు ముందు నిర్వాహకులు, భక్తులు, యువకులు, మహిళల నృత్యాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. పట్టణంలోని సీబీరోడ్డు, అశోక్ పిల్లర్, మెయిన్‌బజారు, గాంధీకట్ట, గాంధీసర్కిల్ మీదుగా తాడిపత్రి సరిహద్దులోని గండికోట నీటిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ఊరేగింపుగా రావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు వినాయకుడి చూసేందుకు తరలివచ్చారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. ప్రజల సౌకర్యార్థం పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉచితంగా వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వినాయక విగ్రహాల ఊరేగింపును పురస్కరించుకుని పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. కాగా ఊరేగింపులో టీడీపీ నాయకులు జేసీ వర్గీయులు, కాకర్ల రంగనాథ్ అనుచరుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో ఆదివారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, కార్మికులు ఏర్పాటు చేసిన టెంకాయల వినాయకుడితో పాటు పలు వినాయక విగ్రహాలను ఎస్ఎస్‌పల్లి చెరువులో నిమజ్జనం చేశారు.

పామిడి: పామిడిలో ఆదివారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్ద విఠోబదేవాలయ వద్ద లాల్‌బాగ్‌చా రాజా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణపతి ప్రతిమను ట్రాక్టర్లపై రాత్రి పొద్దుపోయేదాకా ఊరేగించారు. అనంతరం వినాయక ప్రతిమను మండలంలోని జీ కొట్టాల క్వారీ వద్ద గల చెరువులో నిమజ్జనం చేశారు. మిగతా గణపయ్య విగ్రహాలను స్థానిక పెన్నానదిలో నిమజ్జనం చేశారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న చిక్కవడియార్ చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శింగనమల: నార్పలలో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సాగర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.


పామిడిలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


తాడిపత్రిలో ఉట్టి కొడుతున్న యువతులు


నార్పలలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సమన్వయకర్త శైలజానాథ్, నాయకుడు భోగతి నారాయణరెడ్డి

యల్లనూరు: సీఎం చంద్రబాబునాయుడు మోసపూరిత మాటలతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచారని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. ఆదివారం వెన్నపూసపల్లిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం , ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, 50 ఏళ్లకే ఫింఛన్ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగతి ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి పద్మావతమ్మ, పార్టీ కార్యదర్శి విష్ణునారాయణ, మండల కన్వీనరు శివశంకర్, నాయకులు భోగతి నారాయణరెడ్డి, భోగతి నాగేశ్వరరెడ్డి, భోగతి దిలీప్‌కుమార్‌రెడ్డి, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, తిరుమలాపురం కృష్ణారెడ్డి, రవిచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, పాతపల్లి తిరుపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చింతకాయమంద వెంగముని రమణ, నాగరంగయ్య, వేములపల్లి యోగానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెన్నపూసపల్లి హరిశ్చంద్రారెడ్డి, రామేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి, యల్లనూరు జాఫర్, చేటప్ప, హాజీవలి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ నాయకులతో శైలజానాథ్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని యల్లనూర్‌రోడ్డులో ఉన్న కార్యాలయంలో ఆదివారం రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ (రుఫ్) అధ్యక్షుడు నాగార్జున రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ సాకే శైలజానాథ్ కలిశారు. గతంలో సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా కలిసి పనిచేసామని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రుఫ్ సభ్యులు పుట్లూరు భాస్కర్‌రెడ్డి, యక్కలూరు రంగనాయకులు, నూర్ మహమ్మద్, ఖాదర్ పాల్గొన్నారు.

బైక్ బోల్తా ..ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టంలోని గుంతకల్లు రోడ్డు సమీపంలో ఉన్న చెరువు కట్ట వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరు గాయ పడ్డారు. వివరాలు.. పాత గుంతకల్లుకు చెందిన రమణ, రాఘవేంద్ర పని మీద గుత్తికి వెళ్తుండగా బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో ఇద్దరూ గాయ పడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడికి సన్మానం

పుట్లూరు: మండలంలోని కడవకల్లు ఎస్సీ కాలనీకి చెందిన నాగార్జున అనే యువకుడిని సీపీఎం నాయకులు ఆదివారం సన్మానించారు. మెగా డీఎస్సీ ఎస్‌జీటీ పరీక్షల్లో 61వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై సీపీఎం మండల కార్యదర్శి నూరి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, పెద్దయ్య, భాస్కర్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

15న లేబర్ కార్యాలయ ముట్టడి


పోస్టర్లను విడుదల చేసిన భవన నిర్మాణ కార్మికులు

శింగనమల: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న జిల్లా లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనునట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజినేయులు తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను శింగనమలలో సీపీఐ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అందించాలన్నారు. కానీ కూటమి ప్రభుత్వం కొలువై ఏడాది దాటినా భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోలేదన్నారు. ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందింతే రూ.10 లక్షలు పరిహారం అందించాలన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, రామాంజనేయులు, నాగరాజు, కుళ్లాయప్ప, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పేరం స్వర్ణలతకు పరామర్శ



పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న డాక్టర్ సాకే శైలజానాథ్, నైరుతిరెడ్డి

తాడిపత్రిటౌన్/గుంతకల్లు టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత బ్రెస్ట్ సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆదివారం వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే శైలజానాథ్, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాకే రుత్విక్, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ నీలం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భోగతి ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన శైలజానాథ్

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, యల్లనూరు జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, ఆయన కుమారుడు రిత్విక్ పరామర్శించారు. ఇటీవల మెడ భాగంలో శస్త్ర చికిత్సలు చేయించుకుని వెన్నపూసపల్లిలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా వారు కలిశారు. త్వరగా కోలుకొని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు.

విదేశీ సంస్కృతిని తీసుకురాకండి

పుట్లూరు/శింగనమల/బుక్కరాయసముద్రం: వ్యవసాయమే ఆధారంగా ఉండే పుట్లూరు, నార్పల, శింగనమల మండలాల్లో కారు, బైక్ రేసులతో విదేశీ సంస్కృతిని తీసుకురావడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు విష్ణునారాయణ, రమణాయాదవ్, బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ భాస్కర్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని రైతులకు, కూలీలకు కావాల్సింది సాగునీరు, ఎరువులు, విత్తనాలని.. అలా కాకుండా కారు, బైక్ రేసులు పెట్టి పర్యాటక రంగం అభివృద్ధిగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటి వరకూ హెచ్చెల్సీకి నీరు విడుదల చేయకపోవడంతో .. రైతులు పంటలు సాగు చేయడానికి ఎదురు చూస్తున్నారు. కానీ రైతుల సమస్యలు గాలికి వదిలేసి, పర్యాటక రంగం పేరుతో బైక్, కారు రేస్‌లు అంటూ గ్రామీణ యువకులపై ఎమ్మెల్యే సిటీ కల్చర్‌ని రుద్దుతున్నారన్నారు. ఎల్లుట్ల వద్ద రేసింగ్ బైకు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయన్నారు. కారు, బైక్ రేసులు కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు రైతులు కూలీల సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని వారు సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి రేసులు నిర్వహిస్తే అడ్డుకుంటామన్నారు.

నేడు 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

పుట్లూరు: మండలకేంద్రంలో సోమవారం 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య హాజరవుతారన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట


మహిషాసుర వధ తోలుబొమ్మలాట ప్రదర్శన దృశ్యం

పామిడి: పట్టణంలోని బెస్తవీధిలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద వినాయక మండపంలో శివ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాల సందర్భంగా శనివారం అర్ధరాత్రి ప్రదర్శించిన మహిషాసుర వధ తోలుబొమ్మలాట ఆకట్టుకుంది. అనంతరం ఆలయాల సేవా పరాయణుడు, కవి కే నారాయణమూర్తిని ఆలయ కమిటీ సభ్యుడు నారాయణమూర్తిని సత్కరించారు.

మున్సిపల్ వర్కర్లకు నేడు సన్మానం

గుత్తి: గుత్తి మున్సిపాలిటిలో వినాయక చవితి వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన మున్సిపల్ వర్కర్లను సోమవారం సన్మానించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ వర్కర్లందరూ హాజరు కావాలన్నారు.

ఆలయంలో చోరీ

గుత్తి: మండలంలోని ఇసురాళ్లపల్లిలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. దొంగలు ఆలయం తలుపులను ఓపెన్ చేసి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని నాలుగు హుండీలను దేవాలయం బయటకు ఎత్తుకెళ్లారు. అక్కడ హుండీలను ధ్వంసం చేసి, అందులో ఉన్న సుమారు రూ.30 వేలను అపహరించారు. ఘటనపై పూజారి నరసింహాచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యాడికిలో పడకేసిన పారిశుధ్యం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

యాడికి: మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. గౌతమి స్కూల్, చౌడేశ్వరీ దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, పాత పోలీస్‌స్టేషన్ వద్ద, చిన్న వేపమాను వీధి, వేములపాడు రోడ్డు, విద్యుత్ కార్యాలయం, కెనరా బ్యాంకుకు పోయే రోడ్డులోని కాలనీల్లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విజృంభించి పలువురు రోగాలబారిన పడుతున్నారు. యాడికి పంచాయతీలోని వీరన్నపల్లికి చెందిన గర్భిణి అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతి చెందగా, రెండు రోజుల క్రితం విష జ్వరంతో చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న తేరు మిద్దె వద్ద ఓ అనాథ వృద్ధుడు మృతి చెందాడు. గతంలో అధికారులు తూతూమంత్రంగా బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణ మందు స్ప్రే చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో అపరిశుభ్రత అలాగే ఉంటోంది

ఈఓకు పట్టదా?

స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బంది, మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ పారిశుధ్యంపై పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. యాడికి మేజరు పంచాయతీలో యాడికి, వీరన్నపల్లి, కత్తిమానుపల్లి, చంద్రాయునిపల్లి, రెడ్డి గుడిసెలు, రామన్న గుడిసెలు, వీరన్నపల్లి, తిరునాంపల్లి, తిప్పారెడ్డి పల్లి గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా అపరిశుభ్రత కనిపిస్తోంది. తాగునీరు, వర్షపు నీరు , డ్రేనేజీ ముందుకు కదలక గ్రామాల్లోని రోడ్లపై అలాగే ఉండటంతో దోమలతో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఉన్నారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


యాడికిలోని బుగ్గ రోడ్డులో వివేకానంద ఆలయం ఎదురుగా అపరిశుభ్రత

సమస్యల వెల్లువ

తాడిపత్రి నియోజకవర్గంలో జనాభా పరంగా, ఆదాయ పరంగా అభివృద్ధి పరంగా ముందున్న యాడికి మేజరు పంచాయతీ ప్రస్తుతం నిర్లిప్తతకు, నిర్లక్ష్యానికి కేంద్రంగా మారింది. ఏడాదికి కోటి రూపాయల వరకూ ప్రభుత్వం కేటాయించే ఆర్థిక సంఘం నిధులతో పాటు, సాధారణ నిధులు, ఇంటి పన్నులు, కొళాయి పన్నులతో కళకళలాడాల్సిన పంచాయతీ కళా విహీనంగా తయారైనా పట్టించుకునే నాథుడే లేడని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. యాడికి గ్రామ పంచాయతీలో ప్రతి సోమవారం గొర్రెల సంతను టీడీపీ నాయకులు నిర్వహించుకోవడంతో రూ.50 వేల వరకూ పంచాయతీకి ఆదాయం రాకుండా పోతోందన్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న రూ.53 లక్షల నిధులను అందరూ కలిసి దుర్వినియోగం చేశారని, ఈ విషయంపై గ్రామానికి చెందిన ప్రజలు రెండు వారాల క్రితం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ దుస్థితికి కారణం సమన్వయం కోల్పోయిన పాలక వర్గం, గతంలో పని చేసిన ఈఓ అవినీతి, సిబ్బంది జవాబులేనితనం, దళారులు, నాయకుల దోపిడీయేనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాడికి పంచాయతీలో నిధుల దుర్వినియోగం, వారపు గొర్రెల సంత ఆదాయ వనరుల అవకతవకలపై ఎంపీడీఓ వీర్రాజు, మేజరు పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ శశికళను 'సాక్షి' వివరణ కోరగా ఈ విషయంపై జిల్లా అధికారులకు నివేదిక పంపామని తెలిపారు.


కోన రోడ్డులోని ఓ కాలనీలో ముందుకు కదలని డ్రైనేజీ నీరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పామిడి: మండలంలోని ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2005–06 పదోతరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగాఅప్పటి గురువులు కృష్ణానాయక్, వెంకటరమణ, శ్రీరాములు, విజయలక్ష్మి, విమల, రజియా, నాగప్ప, కృష్ణమాచార్యులు, కుమారస్వామి, హుస్సేన్‌ఖాన్‌ను సన్మానించారు.